సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం । 20 । అక్టోబర్ । 2023



సంతానలక్ష్మిగా కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కనకమహాలక్ష్మి అమ్మవారు సంతానలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు.



అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించి.స్వర్ణ పుష్పార్చన జరిపించారు.

పిచ్చికుక్క స్వైర విహారం



పెదబయలు మండల కేంద్రం లో పిచ్చికుక్క స్వైరవిహారం చేస్తోంది. గురువారం పెదబయలుకు చెందిన ఏడుగురిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. వారు ఆస్పత్రిలో చికిత్స పొందారు.

IIలో

న్యూస్‌రీల్

నేడు, రేపు దేవులపల్లి అమర్ అరకు పర్యటన



సాక్షి,పాడేరు: ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్ ఈనెల 20, 21 తేదీల్లో అరకులోయలో పర్యటిస్తారని కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 20వ తేదీ ఉదయం 9గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి మధ్యాహ్నం ఒంటిగంటకు ఆరకులోయ చేరుకుంటారని, స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారని పేర్కొన్నారు. రాత్రి అరకులోయలోనే బసచేసి, 21వతేదీ ఉదయం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొని, మధ్యాహ్నం 2గంటలకు విశాఖపట్నం బయలుదేరుతారని కలెక్టర్ తెలిపారు.

బస్సు యాత్రపై చింతపల్లిలో సమన్వయ సమావేశం నేడు

ముఖ్యఅథిగా పాల్గొనున్న రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి

చింతపల్లి: జిల్లాలో నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ సామాజిక న్యాయ బస్సు యాత్రపై మండల కేంద్రం చింతపల్లిలో శుక్రవారం ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం జరుగుతుందని ఎంపీపీ అనూషా దేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య తెలిపారు. వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని చెప్పారు. ఈ సమావేశంలో నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొనాలని వారు కోరారు.

నేడు చింతపల్లిలో జగనన్నకు చెబుదాం

చింతపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఆశాజ్యోతి తెలిపారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ సుమిత్ కుమార్, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ హాజరుకానున్నట్టు ఆమె చెప్పారు. ప్రజలు తమ సమస్యలపై కలెక్టర్, ఇతర అధికారులకు అర్జీలు అందజేయవచ్చన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌కు శంకుస్థాపన నేడు

డౌనూరు రానున్న గిరిజన సంక్షేమశాఖ మంత్రి రాజన్న దొర

కొయ్యూరు: మండలంలోని డౌనూరులో రూ.నాలుగు కోట్ల వ్యయంతో నిర్మించనున్న సమీకృత కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌కు శుక్రవారం గిరిజన సంక్షేమశాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర శంకుస్థాపన చేయనున్నట్టు జీసీసీ బీఎం విజయ్‌కుమార్ తెలిపారు. ఈ యూనిట్ లోనే కాఫీ క్యూరింగ్, రోస్టింగ్, గ్రైండింగ్, ప్యాకింగ్ విభాగాలను కూడా ఏర్పాటు చేయనున్నట్టు ఆయన చెప్పారు. ఈ యూనిట్ అందుబాటులో లేక బెంగళూరులో కాఫీని ప్రాసెసింగ్ చేస్తున్నారని, ఇక్కడ యూనిట్,విభాగాల నిర్మాణం పూర్తయితే ఇక్కడే ప్రాసెసింగ్ చేయవచ్చని తెలిపారు. శంకుస్థాపన కార్యక్రమంలో అరకు ఎంపీ మాధవి,పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి, కలెక్టర్ సుమిత్ కుమార్, పీవో అభిషేక్ పాల్గొనున్నట్టు ఆయన చెప్పారు. వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి హాజరుకానున్నట్టు ఆ పార్టీ నేతలు తెలిపారు.

నేడు డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

సాక్షి,పాడేరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ వనుము చిట్టబ్బాయి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలోని జేకేసీ,రసాయన విభాగాలు ఈజాబ్ మేళాను నిర్వహిస్తున్నాయని, నక్కపల్లి ప్రాంతంలోని హెటిరో కంపెనీ ప్రతినిధులు పాల్గొంటారని ఆయన తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ అభ్యర్థులతో పాటు, పాడేరు, అరకులోయ, చింతపల్లి కళాశాలల్లో బీఎస్సీ కెమిస్ట్రీ చదివిన విద్యార్థులు కూడా ఈజాబ్‌మేళాకు హాజరుకావచ్చన్నారు. జాబ్‌మేళా ఉదయం 10గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు.

పంచాయతీ కార్యదర్శి, విస్తరణ అధికారికి షోకాజ్ నోటీసులు

జి.మాడుగుల: అధికారులకు సమాచారం ఇవ్వకుండా, ఎన్నికల నియమావళిని పాటించకుండా ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించిన జి.మాడుగుల పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ విస్తరణ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. జి.మాడుగుల పంచాయతీలో ఉప సర్పంచ్ పదవికి గబ్బాడి నాగమణితో రాజీనామా చేయించి కొత్త ఉపసర్పంచ్‌గా సిరగం నారాయణమ్మను ఎన్నుకున్నారు. సంబంధిత జిల్లా, డివిజన్ స్థాయి అధికారులకు తెలియజేయకుండా ఈఎన్నికను గోప్యంగా నిర్వహించారని, రాష్ట్ర ఎన్నికల సంఘానికి తెలియజేయలేదని డీఎల్‌పీవో,డీపీవోలు అసహనం వ్యక్తం చేశారు. ఈవిషయాన్ని తీవ్రంగా పరిగణించి వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

- అధికంగా బంతిపూల దిగుబడి
- బుట్ట పూల ధర రూ.200పైనే
- కార్తీకమాసం వరకూ జోరుగా విక్రయాలు

లాభాల గుబాళింపు



దేగలవీధి ప్రాంతంలో చిన్నబంతిపూల తోట



పాడేరులో అమ్మేందుకు బుట్టలతో పూలను మోసుకోస్తున్న గిరిజన మహిళలు

సాక్షి,పాడేరు: జిల్లాలో బంతిపూలు సాగుచేస్తున్న రైతులకు లాభాల పంట పండుతోంది. పూల దిగుబడి అధికంగా ఉండడంతో పాటు మంచి ధర పలుకుతోంది. జిల్లాలో సాగుచేస్తున్న సీతమ్మకాటుక రకం(చిన్నబంతి)పూలు ప్రతి ఏడాది గిరిజనులకు సిరులు కురిపిస్తున్నాయి. ఈఏడాది కూడా జిల్లాలో రైతులు భారీగానే బంతితోటలు వేశారు. పూలు అధికంగా పూస్తుండడతో గిరిజనులు గత మూడు వారాల నుంచి పాడేరు పాతబస్టాండ్ మార్కెట్ కేంద్రంగా పెద్ద ఎత్తున అమ్మకాలు జరుపుతున్నారు. ఇటీవల వరకు బుట్ట పూలను రూ.100 ధరతో విక్రయించారు. శరన్నవరాత్రుల సందర్భంగా పూల ధర ఒక్కసారిగా పెరిగింది. వ్యాపారులే నేరుగా గ్రామాలకు వెళ్లి బుట్ట పూలను రూ.200 నుంచి రూ.300ధరతో కొనుగోలు చేస్తున్నారు. దీంతో గత ఐదురోజుల నుంచి రైతులకు మంచి ఆదాయం లభిస్తోంది. దసరా పండగ సమయంలో బుట్ట పూల ధర రూ.400వరకు పలుకుతుంది. దీపావళి, కార్తీక మాసం పూజల్లో బంతిపూలను ఎక్కువగా వినియోగిస్తారు. అప్పటి వరకు మంచి ధర లభిస్తుంది

150 ఎకరాల్లో తోటలు

పాడేరు,హుకుంపేట,జి.మాడుగుల,పెదబయలు మండలాల్లోని సుమారు 150 ఎకరాల విస్తీర్ణంలో గిరిజనులు సొంతంగా చిన్నబంతిపూల తోటలను సాగుచేస్తున్నట్టు ఉద్యానవనశాఖ అంచనా. అక్టోబర్ నుంచి జనవరి వరకు నాలుగు నెలల పాటు బంతిపూల వ్యాపారం జరుగుతుంది.ఈ నాలుగు నెలల్లో బంతిపూల అమ్మకాల ద్వారా గిరిజనులు మంచి ఆదాయం పొందుతారు. పెట్టుబడి లేని పంటగా చిన్నబంతిపూల సాగుకు గుర్తింపు పొందింది. ఎకరానికి కనీసం రూ.50వేల వరకు ఆదాయం లభిస్తుండడంతో ప్రతి ఏడాది గిరిజన రైతులు బంతిపూల తోటలను వేస్తున్నారు. రోజుకు 10 బుట్టల వరకు బంతిపూలను సేకరిస్తున్న గిరిజనులు రూ.1000 నుంచి రూ.1500వరకు ఆదాయం పొందుతున్నారు. దేవీనవరాత్రుల నుంచి కార్తీకమాసం ముగిసే వరకు బంతిపూలకు గిరాకీ ఎక్కువగా ఉంటుంది.

తోటలు వేసే గ్రామాలు

పాడేరు మండంలో లగిశపల్లి, డోకులూరు, బరిసింగి, ఇరడాపల్లి, డి.గొందూరు, గుత్తులపుట్టు, జి.ముంచంగిపుట్టు, గబ్బంగి, జి.మాడుగుల మండలంలో కె.కోడాపల్లి, జి.మాడుగుల, సొలభం, హుకుంపేట మండలంలో డి.చింతలవీధి, దిగుడుపుట్టు, శోభకోట, సంపంగిపుట్టు, చీడిపుట్టు, గడికించుమండ, అడ్డుమంట, సన్యాసమ్మపాలెం, దాలిగుమ్మిడి, పెదబయలు మండలం గంపరాయి, గలగండ పంచాయతీల్లో ఎక్కువగా బంతితోటలు సాగు చేస్తున్నారు.



దేగలవీధిలో పూలను సేకరిస్తున్న గిరిజనుడు

తెలుగు రాష్ట్రాల్లో డిమాండ్

పూజల్లో అధికంగా ఉపయోగించే చిన్నబంతి పూలకు తెలుగు రాష్ట్రాలలో మంచి డిమాండ్ ఉంది. ఇక్కడ కొనుగోలు చేసిన బంతిపూలను ఆనందపురం, విశాఖపట్నం, గాజువాక, రాజమండ్రి, కడియపులంక, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతితో పాటు, తెలంగాణలోని భద్రాచలం, వరంగల్, సికింద్రాబాద్, హైదరాబాద్‌కు వ్యాపారులు తరలిస్తుంటారు.

ఆదాయం బాగుంది



గత రెండు రోజుల నుంచి బుట్టపూలను రూ.200 ధరతో పాడేరు మార్కెట్‌లో అమ్ముతున్నాను. బంతితోట సాగుకు పెట్టుబడి అవసరం లేదు.సంప్రదాయ విత్తనాలతోనే బంతినారు వేసి కొండపోడు,మెట్ట భూముల్లో సాగుచేస్తున్నాం.ఈ ఏడాది కూడా తోటలకు పూల కాపు బాగుంది. రోజుకు ఏడు బుట్టల పూలు అమ్ముతున్నాను.ఆదాయం బాగుంది

–బాదంగి పెద్దమ్మి,
ఇరడాపల్లి, పాడేరు మండలం

జగనన్న చేదోడు @ రూ.3.83 కోట్లు

- జిల్లాలో 3839 మందికి లబ్ధి
- కలెక్టర్ సుమిత్‌కుమార్



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: జగనన్న చేదోడు పథకం నాయీ బ్రాహ్మణులు, రజకులు, దర్జీలకు ఎంతో ఉపయోగపడుతోందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న ఈ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో గురువారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన నాల్గవ విడత జగనన్న చేదోడు కార్యక్రమం ప్రసారాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్‌తో పాటు బీసీ కార్పొరేషన్ అధికారులు, లబ్ధిదారులు వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ బీసీ సంక్షేమానికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని, వాటి ఫలాలు అర్హులందరూ పొందాలని కోరారు. నాయీబ్రాహ్మణులు, రజకులు, దర్జీలకు ఏటా రూ.10వేల చొప్పున ఇప్పటి వరకు నాలుగు విడతల్లో రూ.40వేలు ఆర్థికసాయం అందించారని చెప్పారు. జిల్లాలో ఈ ఏడాది నాల్గవ విడత కింద 3,839 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.3,83,90,000 చెక్కును కలెక్టర్ అందజేశారు. నాలుగేళ్లలో 9,859 మంది లబ్ధిదారులకు రూ.9.85 కోట్లు అందజేసినట్టు ఆయన తెలిపారు. పాడేరు నియోజకవర్గంలో 1,126 మంది, అరకు నియోజకవర్గంలో 881 మంది, రంపచోడవరం నియోజకవర్గంలో 1,832 మంది లబ్ధిపొందారని వివరించారు. అందులో నాయీబ్రాహ్మణులు 202 మంది, రజకులు 301 మంది, దర్జీలు 3,336 మంది ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఏఈవో శంకర్ పాల్గొన్నారు.

రేఖపల్లిలో బతుకమ్మ సందడి



రేఖపల్లి కోటమైసమ్మ ఆలయం వద్ద బతుకమ్మ వేడుకలో పాల్గొన్న మహిళలు యువతులు

వీఆర్‌పురం: తెలంగాణ రాష్ట్ర సంప్రదాయ పండగైన బతుకమ్మ వేడుకలను మండలంలోని రేఖపల్లిలోని కోటమైసమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం మహిళలు ఘనంగా నిర్వహించారు. దీంతో సందడి వాతావరణం నెలకొంది . విలీన మండలాలైన ఎటపాక, కూనవరం, వీఆర్‌పురం మండలాల్లో రాష్ట్ర విభజనకు పూర్వం ఈ పండగను తెలంగాణ కుటుంబాలతో సంబంధాలున్న వారు ఇక్కడ నిర్వహించేవారు. విభజన అనంతరం కూడా ఈ మండలాల్లో ఏటా ఈ పండగను నిర్వహించడం ఆనవాయితీగా మారింది. స్థానికంగా ఉన్న మహిళలు సైతం ఈ బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొంటున్నారు.

అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరావు

అరకులోయ రూరల్: రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనలో భాగంగా ఆయన గురువారం అరకులోయ చేరుకుని ఏపీ టూరిజం హరిత అతిథి గృహంలో బస చేశారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకే అమరావతిని శాసన రాజధానిగా, విశాఖపట్నాన్ని కార్యనిర్వాహక రాజధానిగా, కర్నూలును న్యాయరాజధానిగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. గతంలో ఉన్న ప్రభుత్వాలు ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాదిరిగా ఆలోచించి ఉంటే హైదరాబాద్ లాంటి నగరాలు ఆంధ్రప్రదేశ్‌లో ఉండేవని చెప్పారు.

ఆర్‌ఎంపీలు పరిధి దాటి వైద్యం చేస్తే చర్యలు

డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య



చింతూరు: ఆర్‌ఎంపీలు ప్రాథమిక వైద్యం మాత్రమే చేయాలని, తమ పరిధి దాటి చికిత్స చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య హెచ్చరించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో గురువారం చింతూరు, ఎటపాక మండలాలకు చెందిన ఆర్‌ఎంపీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలామంది ఆర్‌ఎంపీలు అనుమతి లేకున్నా షెడ్యూల్ హెచ్ డ్రగ్‌లతో పాటు స్టెరాయిడ్లు ఇస్తున్నారని తెలిపారు. దీనివల్ల చింతూరు డివిజన్‌లో కిడ్నీ, కాళ్లవాపు రోగులు పెరుగుతున్నారని చెప్పారు. ఇటీవల వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లో తనిఖీలు జరిపి పరిధిదాటి వైద్యం చేస్తున్న 13 మంది ఆర్‌ఎంపీ కేంద్రాలను సీజ్ చేసినట్టు తెలిపారు. ప్రెగ్నెన్సీ టెస్టులు, అబార్షన్లు కూడా చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. కొంతమంది ఆర్‌ఎంపీలు పట్టణ ప్రాంతాల్లోని పెద్ద ఆస్పత్రులకు చెందిన వైద్యులతో కమీషన్లు మాట్లాడుకుని పేదలు, గిరిజనులు భయానికి గురయ్యేలా చేసి, వైద్యం పేరుతో వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఆయన తెలిపారు.

నేడు వీఆర్‌పురం, కూనవరం ఆర్‌ఎంపీలకు..

స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం వీఆర్‌పురం, కూనవరం మండలాలకు చెందిన ఆర్‌ఎంపీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆర్‌ఎంపీలు వారి వద్దనున్న ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు.

ప్రతి పల్లెకు వైద్య సేవలు



మందులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



సీకరిలో వృద్ధులతో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

గూడెంకొత్తవీధి: ప్రతి పల్లెకు వైద్య సేవలను అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి తెలిపారు. గతంలో ఇలాంటి సేవలు అందలేదని తెలిపారు. వంచుల సచివాలయంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందరికీ ఎలా అందుతున్నాయో, అదే తరహాలో వైద్యం కూడా అందరికీ అందాలన్నదే సీఎం లక్ష్యమని చెప్పారు. ఏడు రకాల వైద్య సేవలను అందిస్తున్నామని తెలిపారు. ఆపరేషన్లు అవసరమైన వారిని విశాఖ పంపిస్తున్నట్టు చెప్పారు. చికిత్స అనంతరం కూడా ఆసరా కింద రోగులకు సాయం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోయిన కుమారి, సర్పంచ్‌లు కాసులమ్మ, పనసల రాజేష్, ఎంపీటీసీలు పసుపులేటి నాగమణి, నాయకులు మూర్తి కృష్ణ, జోరంగి సరస్వతి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి గెమ్మిలి జోగిరాజు, పోతురాజు కృష్ణమూర్తి,పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి ప్రసాద్,జోరంగి ప్రసాద్, నేతలు వంతల అరుణ్‌కుమార్,గణపతి, సర్పంచ్ వంశీకృష్ణ, రీముల బుజ్జి పాల్గొన్నారు.

పేదల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

పెదబయలు: పేదలు సంపూర్ణ ఆరోగ్యంతో జీవించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని సీకరి వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ పరిధిలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శిబిరాల్లో ప్రత్యేక వైద్య నిపుణులతో వైద్యసేవలు అందించి, మందులు ఉచితంగా ఇస్తున్నారని చెప్పారు. అనంతరం పౌష్టికాహార స్టాళ్లను పరిశీలించారు. ఈ శిబిరంలో 433 మంది వైద్య సేవలు పొందారు. ఈ కార్యక్రమంలో పాడేరు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.కృష్ణారావు, ఎంపీపీ వరహాలమ్మ, జెడ్పీటీసీ కూడ బొంజుబాబు, ఎంపీడీవో విగ్గిన్స్, వైస్ ఎంపీపీ రాజుబాబు, వైద్యులు సర్వేశ్వరరావు, ఆర్‌ఐ సింహాచలం , సర్పంచ్ కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాడేరు డీఎంహెచ్‌వో జమాల్ బాషా తెలిపారు. మండలంలోని కోరాపల్లి సచివాలయంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ ఎం.రాజులమ్మ ఎంపీటీసీ నానాజీ ప్రారంభించారు. ఈ శిబిరాన్ని సందర్శించిన డీఎంహెచ్‌వో మాట్లాడుతూ అందరికీ సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోందని చెప్పారు. అనంతరం పోషకాహార స్టాల్‌ను పరిశీలించారు. వైద్యులు రవిచంద్రశేఖర్, సౌందర, విఘ్నేష్, రవి, కవిత తదితరులు 472 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.పెదబాలన్న, ఎంపీహెచ్‌ఈవో ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



పోషకాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్ బాషా

గిరిజనులకు కార్పొరేట్ ఆస్పత్రులు సేవలందించాలి



జీఎస్‌ఎల్ వైద్య కళాశాల సిబ్బందితో పీవో సూరజ్‌గనోరే

ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: మైదాన ప్రాంతాల్లో ఉన్న కార్పొరేట్ ఆస్పత్రులు ఏజెన్సీలో గిరిజనులకు వైద్య సేవలు అందించేందుకు ముందుకు రావాలని రంపచోడవరం ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పిలుపునిచ్చారు. స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్లో రాజమండ్రికి చెందిన జి.ఎస్.ఎల్. వైద్యాధికారులు. మెడికల్ కాలేజీ విద్యార్థులు మూడు రోజులపాటు దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ మెడికల్ క్యాంపులో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ మాట్లాడుతూ మాట్లాడుతూ ఏజెన్సీలోని మారుమూల ప్రాంతాల్లో గిరిజనులకు కార్పొరేట్ ఆస్పత్రులు ఉత్తమ సేవలందించాలని కోరారు. జీఎస్‌ఎల్ డెంటల్ ప్రొఫెసర్ డాక్టర్ హరికృష్ణ రాజు మాట్లాడుతూ ఈనెల 16 నుంచి 17వ తేదీ వరకు సుమారు 3500 మంది ఇళ్లకు వెళ్లి దంత సంబంధిత వ్యాధుల పరీక్షలు నిర్వహించినట్టు చెప్పారు.

ఈనెల 18, 19 తేదీల్లో రెండు రోజులపాటు దంత సంబంధిత వ్యాధులు ఉన్న వారికి పరీక్షలు చేసినట్టు తెలిపారు. శిబిరంలో సుమారు 700 మందికి చికిత్సలు చేశామన్నారు. అదే విధంగా తొమ్మిది రకాలైన దత్త సంబంధిత వ్యాధులకు చిన్నపిల్లలకు కూడా వైద్య పరీక్షలు చేశామన్నారు. డెంటల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గంటా సునీల్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

ఐఈఆర్‌పీలకు నియామక పత్రాల అందజేత



నియామక పత్రాన్ని అందజేస్తున్న జేసీ విశ్వనాథన్

విశాఖ విద్య: సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాల్లో ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్(ఐఈఆర్‌పీ)లుగా ఎంపికైన వారికి విశాఖ జేసీ విశ్వనాథన్ నియామక పత్రాలను గురువారం అందజేశారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో 37 పోస్టుల భర్తీకి సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. వివిధ దశల్లో వడపోత అనంతరం మెరిట్‌లో నిలిచిన వారిని ఎంపిక చేశారు. 37 మందిని ఎంపిక చేయగా.. ఇద్దరు ఏజెన్సీ ప్రాంత పోస్టింగ్‌ల్లో చేరేందుకు నిరాకరించారు. దీంతో 35 మందికి జేసీ చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలను అందజేసినట్లు సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ బి. శ్రీనివాసరావు తెలిపారు. డీఈవో చంద్రకళ, ఎం.అబ్దుల్ ఆషా పాల్గొన్నారు.

చింతూరు ఆర్డీవోగా కావూరి చైతన్య



చింతూరు: చింతూరు రెవెన్యూ డివిజనల్ అధికారిగా కావూరి చైతన్యను నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి జవహర్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. 2022 గ్రూప్-1 బ్యాచ్‌కు చెందిన చైతన్య ప్రొబిషనరీ కాలం పూర్తి చేసుకుని ప్రస్తుతం పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్నారు. దీంతో ఆయనకు చింతూరు ఆర్డీవోగా తొలి పోస్టింగ్ ఇచ్చారు.

దుర్గమ్మకు భారీగా సారె



సారెను తీసుకు వెళ్తున్న భక్తులు

కొయ్యూరు: శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఐదో రోజైన గురువారం అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించి, భారీ ఎత్తున సారె సమర్పించారు. స్థానిక కొండపై వెలసిన కనకదుర్గమ్మ సన్నిధికి వందలాది మంది భక్తులు సారె తీసుకెళ్లారు. డప్పు వాయిద్యాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఆలయ కమిటీకి చెందిన ఎం.వి.ప్రసాద్, అనిశెట్టి చిరంజీవి, మేడిబోయిన చిన్న, సర్పంచ్ మాకాడ బాలరాజు, మాకాడ లక్ష్మి, మాజీ సర్పంచ్ మాకాడ సరస్వతి, అశోక్, మట్టపర్తి రాజు, నాగేశ్వరరావు, వీరయ్య, అధిక సంఖ్యలో భవానీ భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెంతకే మెరుగైన వైద్యసేవలు

ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామాల్లో గడప వద్దే మెరుగైన వైద్య సేవలందుతున్నాయని అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. పెదగరువులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ఈ అవకాశాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. శిబిరంలో 580 మందికి వైద్యాధికారులు అనుషా, గాయత్రి, శివమణిలు వైద్య పరీక్షలు చేశారు. ఎంపీపీ కూడా రాజుబాబు, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, సర్పంచ్ కాకరి బొంజుబాబు, నాయకులు సూరయ్య, శివాజి తదితరులు పాల్గొన్నారు.

పాపం పసివాడు



బాలుడిని బాలల సదన్‌కు తరలిస్తున్న మమత

విశాఖ విద్య: పెదవాల్తేరు రాణి చంద్రమణిదేవి ఆస్పత్రి దగ్గర ఓ బాలుడిని ఎవరో చెట్టుకు కట్టేసి వదిలి వెళ్లిపోయారు. మానసిక వికలాంగుడు కావడంతో గంటల తరబడి అక్కడే బాలుడు నరకయాతన అనుభవించాడు. ఈ విషయాన్ని కొంతమంది మమత చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు ఎల్లేటి మమతకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన ఆమె అక్కడికి చేరుకుని బాలుడి దయనీయ పరిస్థితిని చూసి చలించిపోయారు. మలమూత్ర విసర్జనతో అపరిశుభ్ర వాతావరణంలో ఉన్న ఆ బాలుడిని అక్కడ నుంచి వేరే చోటకు తీసుకెళ్లి సపర్యలు చేశారు. మూడవ పట్టణ సీఐ కె.రామారావు ఆదేశాలతో కానిస్టేబుల్ శ్యామ్ సుందర్‌తో కలసి చైల్డ్‌లైన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలల సదన్‌కు తీసుకెళ్లారు. కాళ్లు, చేతులు సరిగా పనిచేయకపోగా.. మాటలు కూడా రాకపోవడంతో ఆ బాలుడి వివరాలు తెలియరాలేదు. కుటుంబసభ్యులొచ్చి తీసుకెళ్లే వరకు అతన్ని బాలల సదన్‌లో ఉంచేలా తగిన ఏర్పాట్లు చేశారు.

సామర్థ్యమెంత..!

- నవంబర్ 3న ప్రభుత్వ, ప్రైవేట్ బడుల్లో ప్రత్యేక పరీక్ష
- 3, 6, 9 తరగతి విద్యార్థులకు ప్రత్యేకం
- భవిష్యత్‌లో సిలబస్ మార్పునకు పక్కాగా కసరత్తు
- ఇంజినీరింగ్ విద్యార్థులకు పరీక్షల నిర్వహణ బాధ్యతలు



తరగతి గదిలో విద్యార్థులు

విశాఖ విద్య: విద్యార్థుల అభ్యసనా సామర్థ్యం ఎలా ఉందనేది తెలుసుకునేందుకు విద్యాశాఖాధికారులు సిద్ధమయ్యారు. ఈ మేరకు స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎస్ఈఏఎస్) – 2023 పేరిట రాష్ట్ర స్థాయిలో నవంబర్ 3న ప్రత్యేక పరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకోసమని ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో గల 2,267 పాఠశాలలను ఎంపిక చేశారు. టోఫెల్ వంటి పరీక్షల నిర్వహణతో మన విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విద్యా కార్యక్రమాలను అమలు చేస్తోంది. భవిష్యత్ చదువులు మరింత పటిష్టంగా సాగేలా పక్కా ప్రణాళికలు తయారు చేసే క్రమంలో విద్యార్థుల చదువుల సామర్థ్యాన్ని పక్కాగా లెక్క తీయాలని ప్రభుత్వం ఆదేశించడంతో దీన్ని విద్యాశాఖాధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో 2,267 స్కూళ్ల ఎంపిక

ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో 4,944, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 1,400 పాఠశాలలు ఉన్నాయి. శాంపిల్ సర్వేలో భాగంగా మూడు జిల్లాల పరిధిలో 2,267 స్కూళ్లను ఎంపిక చేశారు. వీటిలో విశాఖపట్నం జిల్లాలో 525, అనకాపల్లిలో 1,000, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 742 పాఠశాలలు ఉన్నాయి. ఆయా స్కూళ్లలో 3, 6, 9 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక పరీక్ష నిర్వహించనున్నారు. రాష్ట్ర స్థాయిలో దీనిని నిర్వహిస్తున్నందున జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

సామర్థ్యం తెలుసుకునేలా...

3వ తరగతి విద్యార్థులకు వారు చదువుతున్న పాఠ్యాంశాలపైనే ప్రశ్నలతో కూడిన పరీక్ష నిర్వహిస్తారు. 6వ తరగతి విద్యార్థులకైతే ఐదో తరగతి సిలబస్‌తో లాంగ్వేజ్, గణితం, పరిసరాల విజ్ఞానం సబ్జెక్టులు, 9వ తరగతి వారికి 8వ తరగతి సిలబస్‌తో లాంగ్వేజ్, గణితం, సైన్సు, సోషల్ సబ్జెక్టుకు సంబంధించిన పరీక్ష నిర్వహించనున్నారు. 3, 6వ తరగతుల వారికి 40 ప్రశ్నలతో కూడిన పరీక్షకు ఒక గంట సమయం ఇవ్వనున్నారు. 9వ తరగతి విద్యార్థులకు 60 ప్రశ్నలతో కూడిన పరీక్షకు 1:30 గంటల సమయం కేటాయించనున్నారు.

ఫీల్డ్ ఇన్విజిలేటర్లుగా ఇంజినీరింగ్ విద్యార్థులు

డైట్ అధ్యాపకుల పర్యవేక్షణలో ఫీల్డ్ ఇన్విజిలేటర్లుగా ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులకు బాధ్యత అప్పగించి, వారిని పాఠశాలలకు పంపించి పరీక్ష నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసమని విశాఖ జిల్లాలో 577 మంది, అనకాపల్లి జిల్లాలో 1,101 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 818 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. పరీక్ష ఎలా నిర్వహించాలనే దానిపై వీరికి ఆయా జిల్లా కేంద్రాల్లో రెండు రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లా స్థాయిలో జరిగే ఈ శిక్షణకు ఆయా జిల్లాల డీఈవో, డైట్ కాలేజీ ప్రిన్సిపాల్, డీసీఈబీ సెక్రటరీ కో – ఆర్డినేటర్లుగా వ్యవహరిస్తారు.

ఏర్పాట్లు చేస్తున్నాం



స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వేతో విద్యార్థులు చదువుల్లో ఎలా రాణిస్తున్నారో తెలుసుకోవచ్చు. పరీక్ష నిర్వహణకు ఇంజినీరింగ్ విద్యార్థులకు బాధ్యతలు అప్పగిస్తున్నాం. వీరికి శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అంతా సమన్వయంతో పరీక్ష నిర్వహించేలా దృష్టి సారించాం. వాస్తవికతను తెలుసుకునేలా పరీక్షను సమర్థవంతంగా నిర్వహిస్తాం.

– ఎల్.చంద్రకళ, డీఈవో, విశాఖ జిల్లా

నాణ్యమైన చదువు కోసమే..



విద్యార్థులకు నాణ్యమైన చదువు అందించాలనేది ప్రభుత్వ ఉద్దేశ్యం. ఆ దిశగానే పాఠశాలల్లో విద్యా కార్యక్రమాలు అమలవుతున్నాయి. బోధనలో అనేక మార్పులు వచ్చాయి. ఇలాంటి సర్వేల ద్వారా వచ్చే ఫలితాలు ఉపయోగకరంగా ఉంటాయి. సర్వే పక్కాగా చేపట్టాలని విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల డీఈవోలను అప్రమత్తం చేశాం.

–ఎం.జ్యోతికుమారి, ఆర్‌జేడీ

పాపికొండల రూరల్ మార్ట్‌ను సందర్శించిన నాబార్డ్ ఏజీఎం



రేఖపల్లిలోని ఆర్గానిక్ ఉత్పత్తిదారుల మార్ట్‌ను పరిశీలిస్తున్న నాబార్డ్ ఏజీఎం వైఎస్ నాయుడు

వీఆర్‌పురం: మండలంలోని రేఖపల్లిలో పాపికొండల రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రూరల్ ఆర్గానిక్ మార్ట్‌ను నాబార్డ్ ఏజీఎం వై.ఎస్.నాయుడు గురువారం సందర్శించారు. మార్ట్‌లో ఉత్పత్తులు, విక్రయాలకు సంబంధించిన వివరాలను నిర్వాహకులను ఆయన అడిగి తెలుసుకున్నారు. మార్ట్ స్థానికంగా ఒకే ప్రాంతానికే పరిమితం కావడంతో విక్రయాలు తగినంతగా లేవని నిర్వాహకులు తెలిపారు. వెహికల్ అందుబాటులో ఉంటే ఈ ఆర్గానిక్ ఉత్పత్తులను వారాంతపు సంతలు, పర్యాటక ప్రాంతాలకు తరలించి, విక్రయాలను పెంచుకొని వ్యాపారాన్ని అభివృద్ధికి చేసుకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్ర సరిహద్దుకు సమీపంలోని చింతూరులో ప్రతి బుధవారం జరిగే సంతలో ఆర్గానిక్ కూరగాయలు, ఇతర ఉత్పత్తులను సంఘం ఆధ్వర్యంలో విక్రయిస్తున్నామని, అక్కడ ప్రత్యేకంగా మహిళా రైతులకు వర్షాకాలంలో షెడ్‌లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దీనిపై ఆయన స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌డీఎస్ సంస్థ డైరెక్టర్ వి.గాంధీబాబు, ప్రాజెక్ట్ మేనేజర్ రాజ్‌కుమార్, కోఆర్డినేటర్ టి.ఎస్.ఎస్. సుబ్రహ్మణ్యం తదితరులు

దుర్గమ్మకు కుంకుమార్చన



పూజల్లో పాల్గొన్న భవానీ మాలధారులు

సాక్షి, పాడేరు: మండల కేంద్రంలో ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో కనకదుర్గమ్మ తల్లి ఉత్సవ విగ్రహానికి భక్తులు గురువారం రాత్రి కుంకుమార్చన పూజలు ఘనంగా జరిపారు. దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా పట్టణంలో మహిళలు, భవానీ మాలధారులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భవానీ, అయ్యప్ప మాలధారులకు సద్ది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, రమాదేవి దంపతులతో పాటు ఆలయ ప్రధాన అర్చకుడు రామంపంతుల ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

పాము కాటుతో బాలుడి మృతి



బాలరాజు మృతదేహం

అరకులోయ రూరల్/అనంతగిరి : మండలంలో బొండం పంచాయతీ కరకవలస గ్రామ నికి చెందిన కిల్లో బాలరాజు(10) బుధవారం రాత్రి ఇంటి వద్ద నిద్రిస్తుండగా పాము కాటువేసింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు అతనిని అరకులోయ ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందించి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందినట్టు తండ్రి మహేష్ తెలిపారు. మృతదేహాన్ని అరకులోయ ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచి పోస్టుమార్టం అనంతరం గురువారం బంధువులకు మృతదేహం అప్పగించారు. సమచారం తెలుసుకున్న సర్పంచ్ భాస్కర్, పీఏసీఎస్ పర్సన్ ఇంచార్జి హస్తినకుమార్(శ్రీను), సీపీఎం నాయకులు రామారావు, బుజ్జిబాబు, వివిధ పార్టీల నాయకులు పరామర్శించారు,



లంకలో సీతాదేవికి శ్రీరాముని క్షేమ సమాచారం తెలియజేస్తున్న ఆంజనేయుడు





రామాయణం, భాగవతంలోని ఘట్టాలను చాటిచెప్పేలా తీర్చిదిద్దిన బొమ్మలకొలువు, తిలకిస్తున్న విద్యార్థినులు





మహిషాసుర సంహారం వృత్తాంతం తెలియజేసేలా..

బొమ్మల కొలువు.. రెండు కళ్లు చాలవు



రావణ దర్బారులో తోకపై కూర్చున్న హనుమంతుడు

యలమంచిలి (అనకాపల్లి రూరల్): దసరా వేడుకలో బొమ్మలు కొలువుకు ప్రత్యేక స్థానం ఉంది. శరన్నవరాత్రుల్లో మనదైన సంస్కృతినీ, పురాణాల్నీ, దైనందిన జీవితాన్నీ కళాత్మకంగా పరిచయం చేసే అందమైన వేదిక అది. రామాయణం, భాగవతం, మహాభారతం వంటి పురాణాలు, ఇతిహాసాల్లోని దేవుళ్లు, రాక్షసులు, వాగ్గేయకారులతోపాటు జీవనవేదాన్ని పలికించే ఎన్నో బొమ్మలు కనువిందు చేస్తాయక్కడ.. యలమంచిలిలోని ఉపాధ్యాయ దంపతులు సుసర్ల భాగ్యలక్ష్మి, సూర్యప్రకాష్‌ల ఇంటిలో కొలువు దీరిన బొమ్మలను చూసి తీరాల్సిందే. యలమంచిలోని ఓరుగంటివారివీధి మామిడి టవర్స్‌లోని వారి నివాసంలో ప్రతి ఏటా ఈ సంప్రదాయాన్ని క్రమం తప్పకుండా పాటిస్తున్నారు. దసరాకు 20 రోజుల ముందు నుంచే బొమ్మల కొలువు ఏర్పాట్లలో నిమగ్నమై ఉంటారు. ఈ ఏడాది వాళ్లింట్లో ఐదు మెట్ల మీద దేవతల బొమ్మల్ని కొలువుదీర్చారు. తొలి పూజలందుకునే గణపతి, జగన్మాత అసుర సంహార సన్నివేశం, రామాయణం, భాగవతంలోని అనేక ప్రధాన ఘట్టాలు, ఘటోత్కచుడి వృత్తాంతం, కుంభకర్ణుడిని నిద్ర లేపే దృశ్యం, రుషులు, అష్టలక్ష్ములు, రాధాకృష్ణులు, సూర్యభగవానుడు, లంకలో సీతాదేవికి శ్రీరాముని క్షేమ సమాచారం చేరవేసిన ఆంజనేయుడు, రావణ దర్బారు, తోక మీద కూర్చున్న ఆంజనేయ స్వామి, కృష్ణుడు, గోపికలు, దశావతారాలు, వివిధ దేవతామూర్తులు.. ఇలా ఒకటేమిటి సుమారు 500 బొమ్మలను ప్రదర్శనకు ఉంచారు. హైదరాబాద్, చెన్నై, ఏటికొప్పాక, కొండపల్లి నుంచి కొనుగోలు చేసిన బొమ్మలతో దసరాతో పాటు సంక్రాంతికి కూడా వీరు బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తారు.

మట్టి, చెక్కతో చేసిన బొమ్మలనే ప్రదర్శిస్తామని, నేటి తరానికి మన సంప్రదాయం తెలియాలనే ఆశయంతోనే గత పదేళ్లుగా కొలువును తీర్చిదిద్దుతున్నామని భాగ్యలక్ష్మి, సూర్యప్రకాష్ దంపతులు చెప్పారు. చూడడానికొచ్చిన వారికి వాయినాలు, ప్రసాదం ఇస్తామన్నారు.

ఘాట్‌రోడ్డులో అర్ధరాత్రి నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

భయాందోళనలకు గురైన ప్రయాణికులు



ఘాట్‌రోడ్డు బస్సు నిలిచిపోవడంతో మహిళ ప్రయాణికుల అవస్థలు

సీలేరు: సీలేరు నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఆర్టీసీ బస్సు డీజిల్ లేక దారాలమ్మ తల్లి ఘాట్‌రోడ్డులో అటవీ ప్రాంతంలో నిలిచిపోయింది.బుధవారం అర్ధరాత్రి భద్రాచలం నుంచి విశాఖపట్నం బయలుదేరిన బస్సు రాత్రి ఒంటిగంట స్నర సమయంలో ఆగిపోయింది. దీంతో బస్సులో ఉన్న 38 మంది ప్రయాణికులు చిమ్మచీకట్లో సుమారు మూడు గంటల పాటు నరకయాతన అనుభవించారు. తెల్లవారు జామును సీలేరులో నైట్‌హాల్ట్‌గా ఉన్న మరో బస్సును తీసుకెళ్లి ప్రయాణికులను గమ్యస్థానాకి చేర్చారు. ఈ మధ్యకాలంలో తరచూ ఇటువంటి సంఘటనలు జరుగుతుండడంతో ఘాట్‌రోడ్డులో ప్రయాణించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ సందర్భంగా బస్సులో ప్రయాణించిన సీలేరుకు చెందిన గణేష్ అనే వ్యక్తి మాట్లాడుతూ తరచూ బస్సులు ఇలా నిచిలిపోతుండడంతో సరైన సమయానికి గమ్యస్థానానికి చేరలేకపోతున్నామని చెప్పారు. వెంకటరమణమ్మ అనే ప్రయాణికురాలు మాట్లాడుతూ తాను సీలేరు నుంచి విశాఖపట్నం బయలుదేరారని అర్ధరాత్రి డీజిల్ అయిపోయి, దారాలమ్మ తల్లి ఘాటీలో బస్సు నిలిచిపోయిందని తెలిపారు.బస్సులో 38 మంది ప్రయాణికులు ఉన్నారని, నాలుగు గంటలపాటు నరకయాతన అనుభవించామని చెప్పారు.

చెరువు నీళ్లు పంపిణీపై తగాదా

ఒకరు మృతి

కూనవరం : చెరువు నీరు పోలాలకు మళ్లించే క్రమంలో జరిగిన తగాదాలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని పెదార్కూరు గ్రామంలో గురువారం చోటుచేసుంది. ఎటపాక సీఐ గజేంద్ర కుమార్ తెలిపిన వివరాలివి. పెదార్కూరు గ్రామానికి చెందిన నకిరికంటి రాము (55) చెరువునీళ్లకు కాపలా ఉండి పొలాలకు మళ్లిస్తుంటాడు. అదే గ్రామానికి చెందిన గిరిజన రైతు ధర్మల పిచ్చయ్య తన పొలానికి నీళ్ల మళ్లించాలని కోరడంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగిందని ఆ క్రమంలో ధర్మల పిచ్చయ్య కర్రతో నకిరికంటి రాము తలపై కొట్టడంతో అయన మృతి చెందినట్టు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోతులగుట్ట ప్రభుత్వాస్పత్రికి తరలించి, అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పిచ్చికుక్క స్వైర విహారం

పెదబయలు: పెదబయలు మండల కేంద్రంలో పిచ్చి కుక్క స్వైరవిహారం చేస్తుంది. పెదబయలు గ్రామానికి చెందిన కిముడు లక్ష్మీ 65 సంవత్సరాలు స్థానిక స్టేట్ బ్యాంకు పరిసరాలకు వెళ్లి తిరిగి వస్తుండగా పిచ్చికుక్క ఆమెపై దాడి చేసి ముఖం, చేతులు భాగాల్లో కరిచింది.

సమీపంలో ఉన్న గడుతూరి చిరంజీవి అనే యువకుడికి గాయపరిచింది. అలాగే గ్రామానికి చెందిన చంద్రం, అశోక్, భరద్వాజ్, సోమేష్. బుజ్జిబాబులను కరిచి గాయపరిచింది. వెంటనే స్థానిక ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకున్నారు. పిచ్చికుక్కల బెడదతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. పెదబయలులో ఇటీవల కాలంలో పిచ్చికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.